సాక్షి అనకాపల్లి

బుధవారం । 6 । మార్చి । 2024


అన్నా.. మేము సిద్ధం


ఆత్మీయనేతకు పుష్పాభిషేకం

అపూర్వ స్వాగతం

నగరంలో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అపూర్వ స్వాగతం లభించింది. రాడిసన్ బ్లూ హోటల్ ముందు కార్యకర్తలు, అభిమానులు సిద్ధం ఫ్లకార్డులు ప్రదర్శించి స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి కాన్వాయ్‌పై పూలు చల్లుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు.

న్యూస్‌రీల్

అనకాపల్లి జిల్లాలో సీఎం జగన్ పర్యటన ఖరారు

- రేపు పిసినికాడలో 'చేయూత' నిధులు విడుదల చేయనున్న ముఖ్యమంత్రి

సాక్షి, అనకాపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈనెల 7న అనకాపల్లి జిల్లాకు రానున్నారు. ఈ మేరకు మంగళవారం పర్యటన షెడ్యూల్ అధికారికంగా ఖరారయింది. సీఎం ప్రత్యేక విమానంలో ఉదయం 10.20 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు వస్తారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.45 గంటలకు కశింకోట మండలం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. స్థానిక ప్రజాప్రతినిధులతో 10 నిమిషాల పాటు ముచ్చటిస్తారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన ప్రయాణించి 11.15 గంటలకు పిసినికాడ వద్ద గల సభా వేదిక వద్దకు చేరుకుంటారు. 11.20 గంటలకు వేదికపై మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తారు. 11.40 గంటల నుంచి 12.40 గంటల వరకు గంట పాటు సీఎం ప్రసంగిస్తారు. అనంతరం వైఎస్సార్ చేయూత చివరి విడత నిధుల పంపిణీని బటన్ నొక్కి ప్రారంభిస్తారు. మహిళామార్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు ప్రదానం చేస్తారు. మధ్యాహ్నం 12.55 గంటలకు బయలుదేరి కశింకోటలో హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. గంటసేపు ప్రజాప్రతినిధులతో ముచ్చటించిన అనంతరం 2.10 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి 2.35 గంటలకు విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు తిరుగు పయనమవుతారు.

ఉపాధ్యాయునిపై పోక్సో కేసు

- మైనర్ విద్యార్థినితో అసభ్యకర ప్రవర్తన

మునగపాక: బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయునిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పరవాడ డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన మంగళవారం రాత్రి విలేకరులకు తెలిపారు. మునగపాక దళితవాడకు చెందిన బాలిక స్థానికంగా ఉన్న పాఠశాలలో 5వ తరగతి చదువుకుంటోంది. అదే పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న శివకోటి దుర్గాప్రసాద్ కొంతకాలంగా మైనర్ బాలికతో అసభ్యకరంగా ప్రవరిస్తూ వచ్చాడు. బాలిక గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతుండడాన్ని గమనించిన కుటుంబ సభ్యులు ఆరా తీశారు. దీంతో తనపై దుర్గా ప్రసాద్ అనుచితంగా ప్రవర్తించాడని బాలిక చెప్పడంతో మునగపాక పోలీసులకు తల్లితండ్రులు ఫిర్యాదు చేశారు. పరవాడ డీఎస్పీ సత్యనారాయణ, యలమంచిలి సీఐ గఫూర్, ఎస్‌ఐ పి.ప్రసాదరావులు బాలిక నుంచి వివరాలు సేకరించారు. ఉపాధ్యాయునిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు.

నేడు 'మిచాంగ్' పంట నష్ట పరిహారం విడుదల

- జిల్లాలో 28,247 మంది రైతులకు రూ.11.29 కోట్లు మంజూరు

సాక్షి, అనకాపల్లి: జిల్లాలో 2023 డిసెంబర్ నెలలో మిచాంగ్ తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం బుధవారం పరిహారం విడుదల చేయనుంది. తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో బటన్ నొక్కి నిధులు విడుదల చేస్తారు. జిల్లాలో పంట నష్టపోయిన 28,247 మంది రైతులకు రూ.11.29 కోట్లు విడుదల చేయనున్నారు. జిల్లా స్థాయి కార్యక్రమం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆధ్వర్యంలో జరగనుంది. మిచాంగ్ తుపాను ప్రభావంతో వాటిల్లిన పంట నష్టాన్ని అంచనా వేసేందుకు ప్రత్యేకంగా ఎన్యూమరేషన్ బృందాలను ఏర్పాటు చేసి ప్రభుత్వం త్వరితగతిన సర్వే చేయించింది. పూర్తిగా, పాక్షికంగా నష్టపోయిన పంటను గుర్తించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. జిల్లా స్థాయి వ్యవసాయ అధికారులతో ఏర్పాటు చేసిన ఈ బృందాలు ఇచ్చిన నివేదికల ఆధారంగా నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందజేయనున్నారు. ఈ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని అన్ని రైతు భరోసా కేంద్రాలలో రైతులు వీక్షించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొనున్నారు.

జూలో నీటి ఏనుగుల సందడి

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో నీటి ఏనుగులు సందడి చేస్తున్నాయి. సీతాకోక చిలుకల పార్కుల ఎదురుగా నీటి ఏనుగుల ఎన్‌క్లోజరు ఉంది. దానిలో రెండు నీటి ఏనుగులు ఉన్నాయి. ఆ రెండూ తల్లీపిల్ల కావడం విశేషం. తల్లి నీటి ఏనుగు పద్మ, పిల్ల నీటి ఏనుగు జూనియర్ దలపతి రెండూ కలియ తిరుగుతూ సందర్శకులను అలరిస్తున్నాయి. సాధారణంగా ఇవి నీటిలోనే ఎక్కువ సమయం గడుపుతాయి. సందర్శకులకు వాటి తల భాగం మాత్రమే బయటకు కనిపిస్తుంది. యానిమల్ కీపర్ ఆహారం వేసిన సమయంలో రెండూ ఒడ్డుకు చేరుకుని ఆహారం తింటాయి. మళ్లీ నీటిలోకి వెంటనే వెళ్లిపోతాయి.



వీ-కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంటున్న వివిధ సంస్థల ప్రతినిధులు


విశాఖ పరిపాలన భవన నమూనాను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

విశాఖపై

ఇదీ జగన్ విజన్

- నగర రూపురేఖలు మార్చేలా 'విజన్ విశాఖ' ప్రకటన
- ఐదు విభాగాల వారీగా అభివృద్ధి
- రూ.లక్షా 5 వేల కోట్ల వ్యయంతో ప్రణాళికలు
- ప్రమాణ స్వీకారమూ విశాఖలోనేనని ప్రకటన
- వైజాగ్‌పై సీఎం మమకారం.. నగర వాసుల్లో హర్షాతిరేకం


జీవీఎంసీలో అభివృద్ధి పనుల శంకుస్థాపన అనంతరం నమూనా చిత్రాలు పరిశీలిస్తున్న సీఎం జగన్


విజన్ విశాఖ ప్రజెంటేషన్‌ను వీక్షిస్తున్న సీఎం జగన్, మంత్రులు బొత్స, రజని, ముత్యాలనాయుడు, అమర్, సురేష్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ప్రపంచ పటంలో విశాఖను ఠీవిగా నిలబెట్టేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన విజన్‌ను స్పష్టంగా ప్రకటించారు. రానున్న ఐదేళ్ల కాలంలో విశాఖ నగర కేంద్రంగా చేపట్టే అభివృద్ధి పనులు, వచ్చే పెట్టుబడులు, జరిగే కార్యక్రమాలను వివరిస్తూ ఆయన విడుదల చేసిన 'విజన్ విశాఖ'పై సర్వత్రా చర్చ జరుగుతోంది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలకు దీటుగా.. విశాఖ అభివృద్ధికి ఉన్న అవకాశాలను ముఖ్యమంత్రి వివరించిన తీరు.. సమావేశానికి హాజరైన పారిశ్రామికవేత్తలు, వాణిజ్యవర్గాలతో పాటు నగరవాసులను ఆకట్టుకుంది. విశాఖ నగర అభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రతిపక్షాలతో పాటు పచ్చపత్రికలు విషం కక్కుతున్న తీరును ఆయన సూటిగా ఎత్తిచూపారు.

'విజన్ విశాఖ'లో భాగంగా ఏపీ డెవలప్‌మెంట్ డైలాగ్ విత్ సీఎం కార్యక్రమం, విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు వీలుగా భవిత కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు తాడేపల్లి నుంచి సీఎం వైఎస్ జగన్ మంగళవారం ఉదయం నగరానికి చేరుకున్నారు. రాడిసన్ బ్లూ హోటల్‌లో నిర్వహించిన 'విజన్ విశాఖ'లో సీఎం ప్రసంగించారు. రాష్ట్రాభివృద్ధిలో భాగంగా నగరాభివృద్ధిని వివరించిన తీరు అటు పారిశ్రామికవేత్తలను ఇటు వ్యాపారవర్గాలను ఆకట్టుకుంది. కేవలం మాటలతోనే సరిపెట్టకుండా.. ఈ సందర్భంగా నగరంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఇదే వేదికగా ఆయన శంకుస్థాపనలు కూడా చేశారు. ఎన్నికల తర్వాత విశాఖలోనే ప్రమాణ స్వీకారం చేస్తానని.. ఇక్కడి నుంచే పరిపాలిస్తానంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రకటనతో నగరవాసుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. విశాఖ నగరంపై ఆయనకున్న ప్రేమను మరోసారి నగరవాసులు గుర్తు చేసుకున్నారు. అనంతరం పీఎంపాలెంలోని వీ-కన్వెన్షన్‌లో భవిత కార్యక్రమాన్ని ప్రారంభించి.. యువతనుద్దేశించి మాట్లాడారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా చదువుకునే సమయంలోనే విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని పారిశ్రామికవేత్తలు కొనియాడారు.

ఐదేళ్లు.. ఐదు విభాగాలు

విశాఖ నగరాన్ని ప్రపంచపటంలో ప్రముఖంగా నిలబెట్టేందుకు వీలుగా రానున్న ఐదేళ్ల కాలంలో ఐదు ప్రధాన విభాగాల్లో చేపట్టనున్న అభివృద్ధి ముఖ చిత్రాన్ని సీఎం జగన్ ఆవిష్కరించారు. సుమారు రూ.1,05,000 కోట్లతో ఏయే విభాగాల్లో ఎంత మేర వ్యయం చేయనున్నామనే అంశాన్ని పేర్కొన్నారు.

- కనెక్టివిటీ
- ఇండస్ట్రియల్ ల్యాండ్ స్కేప్
- అర్బన్ ప్లానింగ్, సిటీ ఇన్ఫ్రాస్ట్రక్చర్
- సోషల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్
- స్థిర అభివృద్ధి– పర్యావరణ సమతుల్యత

విశాఖ.. ఎకనామిక్ గ్రోత్ ఇంజిన్

రాష్ట్ర అభివృద్ధికి ఒక గ్రోత్ ఇంజిన్ అవసరమని.. అది విశాఖపట్నమేనని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించారు. రాష్ట్ర ఆర్థిక వనరుల పెంపుతో పాటు పారిశ్రామికంగా, సర్వీసురంగ పరంగా.. విద్య, వైద్యంతో పాటు హోటల్స్ ఇలా అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలబెట్టే సత్తా విశాఖ నగరానికి ఉందని సీఎం పేర్కొనడాన్ని నగరవాసులు ఆహ్వానించారు. విశాఖ నగర అభివృద్ధి ముఖ చిత్రాన్ని ఈ సందర్భంగా ఆయన స్పష్టంగా ఆవిష్కరించారు. ఇందుకోసం ఇప్పటికే చేపడుతున్న కార్యక్రమాలతో పాటు చేపట్టబోయే అంశాలను వివరించారు. రాష్ట్రాభివృద్ధిలో విశాఖ ప్రాధాన్యం, పరిపాలన రాజధానిగా ఎందుకు విశాఖను ఎంపిక చేశామో.. సీఎం వివరించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. సదస్సుకు హాజరైన పారిశ్రామిక, వాణిజ్య వర్గాలు సీఎం విజన్‌ను మెచ్చుకున్నారు. విశాఖను కీర్తిస్తూ సీఎం ప్రసంగించిన ప్రతీసారి సభికుల నుంచి కరతాలధ్వనులతో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, ఆదిమూలపు సురేష్, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, బి.వి.సత్యవతి, మేయర్ హరి వెంకటకుమారి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి, కరణం ధర్మశ్రీ, అదీప్‌రాజ్, ఉమాశంకర్ గణేష్, కంబాల జోగులు, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, వైఎస్సార్ సీపీ విశాఖ పార్లమెంట్ సమన్వయకర్త బొత్స ఝాన్సీ, నెడ్‌క్యాప్ మాజీ చైర్మన్ కె.కె.రాజు, పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి, కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి, ఏయూ వీసీ ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్ట్‌లను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, మంత్రి అమర్‌నాథ్


రాడిసన్ బ్లూలో జరిగిన విజన్ విశాఖ కార్యక్రమానికి హాజరవుతున్న పారిశ్రామిక, వాణిజ్యవేత్తలు


వీ- కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు, విద్యార్థులు

చంద్రబాబు పాలనలో బీసీలకు మొండిచేయి


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

- సముచిత ప్రాధాన్యం ఇచ్చింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే
- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: బీసీలను ఓటు బ్యాంక్‌గా మార్చుకొని అనేకసార్లు అధికారం అనుభవించిన తెలుగుదేశం పార్టీ ఆ కులాలకు ఎటువంటి న్యాయం చేయలేదని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. ఇప్పుడు జయహో బీసీ అంటూ సభ పెట్టి వారిని మరోసారి వాడుకొని వదిలేసే ప్రయత్నం చేస్తోందన్నారు. చోడవరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక వెనుకబడిన కులాలైన బీసీలకు అన్ని రంగాల్లో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి తగిన ప్రాధాన్యం ఇచ్చారన్నారు. బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారన్నారు. బీసీ మహిళలకు చేయూతతోపాటు అనేక సంక్షేమ పథకాలు మంజూరు చేసి వారిని ఆర్థికంగా అభివృద్ధి చేసిన ఘనత వైఎస్సార్‌సీపీదేనన్నారు. గతంలో టీడీపీ హయాంలో స్వతంత్ర నిర్ణయాలు తీసుకొని, సీఎం పక్కన కూర్చునేటంత హోదా టీడీపీ ఎప్పుడూ బీసీలకు కల్పించలేదన్నారు. కానీ వైఎస్సార్‌సీపీ హయాంలో బీసీలకు డిప్యూటీ సీఎం పదవి ఇచ్చి ప్రభుత్వ నిర్ణయాల్లో తగిన భాగస్వామ్యం ఇచ్చారన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ మారిశెట్టి విజయ శ్రీకాంత్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, పంచాయతీ ఉపసర్పంచ్ పుల్లేటి వెంకట్రావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నాగులాపల్లి రాంబాబు, జిల్లా మహిళా విభాగం కార్యదర్శి అల్లాడ భవాని తదితరులు పాల్గొన్నారు.

రూ.30 లక్షలతో 'నాగావళి' ఆధునికీకరణ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో రూ.30 లక్షల నిధులతో ఆధునికీకరించిన హాస్టల్ భవన సముదాయం నాగావళి పేరిట అందుబాటులోకి వచ్చింది. నాడు–నేడు పథకంలో భాగంగా అభివృద్ధి చేసిన ఈ హాస్టల్‌ను మంగళవారం ఉదయం విద్యార్థినులతో వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి ప్రారంభింపజేశారు. కళాశాలలో పెరుగుతున్న విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా అదనపు హాస్టల్‌ని అందుబాటులోకి తీసుకువచ్చారు. కొత్త హాస్టల్ వసతి అందుబాటులోకి రావడంతో విద్యార్థినులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అనంతరం వీసీ విద్యార్థినులతో మాట్లాడారు. అక్కడే టిఫిన్ చేసి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ప్రిన్సిపాల్స్ ఆచార్య జి.శశిభూషణరావు పాల్గొన్నారు.

- కౌన్సిల్ హాల్లో టీడీపీ గూండాగిరీ

మంట కలిసిన సభా మర్యాద

- నర్సీపట్నం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాస
- అధికార పక్ష సభ్యుడికి చింతకాయల పద్మావతి బెదిరింపు
- కౌన్సిల్ హాల్లోకి దూసుకొచ్చిన టీడీపీ, జనసేన శ్రేణులు


వైస్ చైర్మన్ రామకృష్ణపైకి దూసుకొచ్చిన అయ్యన్నపాత్రుడి తనయుడు, కౌన్సిలర్ రాజేష్


వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లపై తిరగబడుతున్న టీడీపీ నాయకులు పైల గోవిందరావు, చింతు

నర్సీపట్నం: మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మునుపెన్నడూ చూడని ఉద్రిక్త వాతావరణం తాండవించింది. విపక్ష సభ్యులు, వారికి మద్దతుగా బయటి నుంచి వచ్చిన టీడీపీ, జనసేన నేతలు సృష్టించిన దౌర్జన్యకాండ సభా మర్యాదలను కాలరాసింది. కౌన్సిలర్లుగా ఉన్న అయ్యన్నపాత్రుడి భార్య, కుమారుడు అధికారపక్ష సభ్యులపై బెదిరింపులకు దిగడంతో పాటు కౌన్సిల్లో సభ్యత్వం లేని వారు సైతం గూండాగిరీ చేశారు. తొలుత అజెండాలోని అంశాలను మున్సిపల్ అధికారులు సభ ముందుంచారు. కొత్తవీధి రోడ్డుకు రక్షణ గోడలు నిర్మించకుండా రోడ్డు వేయడం వల్ల ప్రయోజనం ఏమిటని టీడీపీ కౌన్సిలర్ ప్రస్తావించారు. రోడ్డుకు రక్షణ గోడలు సైతం నిర్మిస్తామని ఇంజనీరింగ్ అధికారులు బదులిచ్చారు. చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, టీడీపీ కౌన్సిలర్ చింతకాయల పద్మావతిల వాగ్వాదం జరిగింది. వైస్‌చైర్మన్ కోనేటి రామకృష్ణ కల్పించుకుని అయ్యన్నపాత్రుడు 40 ఏళ్లలో చేయలేని అభివృద్ధిని ఐదేళ్లలో మా ఎమ్మెల్యే గణేష్ చేసి చూపించారన్నారు. ఈదశలో వైస్‌చైర్మన్ రామకృష్ణతో టీడీపీ కౌన్సిలర్లు అయ్యన్న తనయుడు రాజేష్, మధు దూషణలకు దిగారు. రాజేష్ తన సీటులో నుంచి వైస్‌చైర్మన్ వైపు దూసుకువచ్చారు. ఈ దశలో రెండు పార్టీల కౌన్సిలర్లు తోసుకున్నారు. దీంతో సభలో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. చింతకాయల పద్మావతి వేలు చూపిస్తూ మీ సంగతి చూస్తానంటూ వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లపై బెదిరింపులకు దిగారు. కౌన్సిల్ హాల్ బయట ఉన్న టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన పైల గోవిందరావు, పెదిరెడ్ల చింతు, అద్దేపల్లి గణేష్ సభలోకి ప్రవేశించి, వైస్‌చైర్మన్ రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లపై తిరగబడ్డారు. వైస్‌చైర్మన్, కౌన్సిలర్లు సిరసపల్లి నాని, బయపురెడ్డి చినబాబు, మాకిరెడ్డి బుల్లిదొర, వీరమాచినేని జగదీశ్వరి కౌన్సిల్ సమావేశంలోకి ఎందుకు వచ్చారని వారిని నిలదీశారు. ఈ సమయంలో కొట్లాట జరిగే ప్రమాదం ఉండడంతో పాలకపక్ష కౌన్సిలర్ చెక్కా బాలమ్మ, కోఆప్షన్ సభ్యులు షేక్ రోజా అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్ల మధ్య అడ్డంగా నిలబడ్డారు. కొద్దిసేపటికి ఎవరికి వారు వెనక్కు తగ్గడంతో సభను కొనసాగించారు. సమావేశంలో కమిషనర్ రవిబాబు తదితర అధికారులు పాల్గొన్నారు.

పోలీసులకు చైర్‌పర్సన్ ఫిర్యాదు


ఫిర్యాదు అందజేస్తున్న చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి

నర్సీపట్నం: సభా నిబంధనలు అతిక్రమించి, కౌన్సిల్లోకి వచ్చి పాలకపక్ష కౌన్సిలర్లపై తిరగబడిన టీడీపీ, జనసేనలకు చెందిన పైల గోవిందరావు, పెదిరెడ్ల చింతు, అద్దేపల్లి గణేష్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా సభలోకి ప్రవేశించడమే కాకుండా సభ నిర్వహణకు ఆటంకం కలిగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పాలకపక్ష మహిళా కౌన్సిలర్ చెక్కా బాలమ్మ, కోఆప్షన్ సభ్యులు షేక్ రోజాపై దురుసుగా ప్రవర్తించి, సభలో వారిని అవమానపరిచి, బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సభకు సంబంధం లేని ముగ్గురు వ్యక్తులు 'బయటకు రండి చూసుకుందామ'ని మహిళా సభ్యులను హెచ్చరించటం బాధాకరమన్నారు. వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

క్లుప్తంగా

అనకాపల్లి డీఎస్పీగా అప్పలరాజు



అనకాపల్లి: అనకాపల్లి డీఎస్పీగా ఎస్.అప్పలరాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖ రూరల్ ఇంటెలిజెంట్ విభాగంలో డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఈయన బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న డీఎస్పీ వి.సుబ్బరాజు విజయవాడ ఏసీబీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ దిగువ స్థాయి సిబ్బందితో కలిసి డివిజన్ పోలీస్ పరిధిలో సమస్యలు పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో చోడవరం క్రీడాకారులకు పతకాలు



పతకాలు సాధించిన చోడవరం యువకులు యుంగధర్, మణికంఠ

చోడవరం: జాతీయ స్థాయి బాడీ లిఫ్టింగ్ పోటీల్లో చోడవరం క్రీడాకారులు పతకాలు సాధించారు. బిహార్ రాష్ట్రం పాట్నాలో ఇటీవల జరిగిన ఈ పోటీల్లో చోడవరం గణేష్ డిఫెన్స్ అకాడమీకి చెందిన జి.యుగంధర్, కె. మణికంఠ పాల్గొన్నారు. 60 కేజీల విభాగంలో యుగంధర్ బంగారు, 75 కేజీల విభాగంలో మణికంఠ కాంస్య పతకాలను సాధించారు. వీరిని ఆంధ్రా బాడీ లిఫ్టింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె. గణేష్, డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ పుల్లేటి గణేష్, క్రీడా అభిమానులు అభినందించారు.

ఇంజినీరింగ్ విద్యార్థిని అదృశ్యం

మునగపాక: చదువుకునేందుకు కళాశాలకు వెళ్లిన విద్యార్థిని అదృశ్యంపై మునగపాక పోలీసులకు ఫిర్యాదు అందింది. మండలంలోని అరబుపాలెం గ్రామానికి చెందిన ఆమె అనకాపల్లి సమీపంలోని ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతోంది. ఈ నెల 4న ఇంటి నుంచి బయలు దేరి కళాశాలకు వెళ్లింది. సాయంత్రానికి తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బంధువులను, స్నేహితులను ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధికి జగనన్న పెద్దపీట



ముకుందపురంలో నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



కె.జె.పురం నుంచి అప్పలరాజుపురం పోవు బి.టి.రోడ్డును ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు
- రూ.6.45 కోట్ల పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన

మాడుగుల రూరల్: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని ముకుందపురం, కె.జె. పురం గ్రామాల్లో రూ.6.50 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి 7 గంటల వరకు సాగిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ భవనాల నిర్మాణంతో సుస్థిరమైన అభివృద్ధికి చిరునామాగా నియోజకవర్గం నిలిచిందన్నారు. దీంతోపాటు తాగునీటి సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారం అయిందన్నారు. తొలుత ముకుందపురంలో రూ.73 లక్షలతో నిర్మించిన ఆర్బీకే, గ్రామ సచివాలయం భవనాలను ప్రారంభించారు. అనంతరం రూ 40 లక్షలతో చేపట్టే వంటర్లపాలెం కరణంగారి మదుము నుంచి గ్రామానికి పోవు సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. రూ.55.30 లక్షలతో కె.జె.పురం నుంచి అప్పలరాజుపురం పోవు బీటీ రోడ్డును, రూ.40 లక్షల కె.జె.పురం గ్రామ సచివాలయం -1 భవనాన్ని, గడప గడపకు మన ప్రభుత్వంలో మంజూరు చేసిన రూ.40 లక్షలతో సీసీరోడ్డును, ఎస్సీ కాలనీలో రూ.3 లక్షలతో కమ్యూనిటీ హాలును నిర్మించారు. వీటితోపాటు గ్రామంలో రూ.3.50 కోట్లతో చేపట్టిన జలజీవన్ మిషన్ పథకం ప్రారంభోత్సవం చేశారు. రూ.20 లక్షలతో మినీ కల్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తెలకలదీపంలో రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాస్, ఎంపీడీవో ఆర్ కాశీప్రసాదు, డిప్యూటీ తహసీల్దారు లక్ష్మయ్య, మండల ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసరావు, ఏవో ఎం. వాసుదేవరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నర్సింగరావు, సర్పంచ్‌లు జామి రమణబాబు, కర్రి గణేశ్, అల్లాడ నాగేశ్వరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కాళ్ల రాము, తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల కోటపై మళ్లీ వైఎస్సార్ సీపీ జెండా..



మాడుగులలో ప్రచారం చేస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ, అనురాధ, తదితరులు


- ప్రచారం ప్రారంభించిన బూడి సతీమణి
- సంక్షేమాభివృద్ధికి పట్టం కట్టండి: ఈర్లె అనురాధ



అమ్మవారి సేవలో పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు అనురాధ, తదితరులు

మాడుగుల: మూడోసారి మాడుగుల కోటపై పార్టీ జెండా ఎగుర వేయడానికి ప్రతి కార్యకర్త సైనికునిల్లా పని చేయడానికి సిద్ధం కావాలని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ పిలుపు నిచ్చారు. ఉత్తరాంధ్రుల ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయం వద్ద నుంచి ఆమె తన తల్లి బూడి రమణమ్మతో కలిసి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడకు పెద్ద ఎత్తున తరలి వచ్చిన కార్యకర్తలనుద్దేశించి మాడుగుల కోటపై పార్టీ జెండా ఎగుర వేయడానికి సిద్ధమా? అని అడగ్గా, వారితో పాటు గ్రామస్తులు తామంతా సిద్ధమేనని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. జై జగన్, జై బూడి అంటూ పెద్దగా నినాదాలు చేస్తూ మాడుగుల పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి మహిళల నుదుట తిలకం దిద్ది అభ్యర్థించారు. పార్టీలకతీతంగా అందజేసిన సంక్షేమం చూసి ఆదరించాలని కోరారు. మాడుగుల ఎమ్మెల్యేగా బూడి ముత్యాలనాయుడును మరోసారి అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి మహిళా శక్తి ఏకతాటి మీదకు రావాలన్నారు. అంతకుముందు ఎన్నికల ప్రచార పత్రం మోదకొండమ్మ పాదాల వద్ద ఉంచి పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ అప్పలరాజు, కమిటీ సభ్యులు, అర్చకులు పూర్ణకుంబంతో స్వాగతం పలికి అమ్మవారి జ్ఞాపిక అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో మాడుగుల, దేవరాపల్లి ఎంపీపీలు తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, కిలపర్తి రాజేశ్వరి, దేవరాపల్లి, చీడికాడ జెడ్పీటీసీలు కర్రి సత్యం, లాలం శారదారామ్, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ ఎడ్ల కళావతి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు దేవరాపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు పొలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, తలారి అప్పారావు, సర్పంచ్‌లు గొల్లవిల్లి సంజీవరావు, కొసిరెడ్డి కృష్ణమూర్తి, శోలం రమేష్ పాల్గొన్నారు.

నేడు మాజీ మంత్రి బలిరెడ్డి విగ్రహావిష్కరణ



పీఎస్‌పేటలో ఆవిష్కరించనున్న బలిరెడ్డి సత్యారావు విగ్రహం

చోడవరం: దివంగత వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి బలిరెడ్డి సత్యారావు నిలువెత్తు విగ్రహాన్ని ఈనెల 6వ తేదీన ఆయన స్వగ్రామమైన చోడవరం మండలం పీఎస్‌పేట గ్రామంలో ఆవిష్కరించేందుకు గ్రామస్తులు భారీ ఏర్పాట్లు చేశారు. గ్రామస్తులు, కుటుంబసభ్యులు కలిసి ఆయన నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. నిజాయితీ రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనంగా, పంచకట్టు నాయకుడిగా జిల్లాలో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న బలిరెడ్డి సమితి ప్రెసిడెంట్‌గా, ఎమ్మెల్యేగా, మంత్రిగా అనేక పదవులు చేశారు. కాంగ్రెస్ పార్టీలో తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం అనంతరం 2011లో వైఎస్సార్‌సీపీలో చేరి చోడవరం నియోజకవర్గంలో పార్టీకి వెన్నంటే ఉన్నారు. నాలుగేళ్ల కిందట ఆయన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ ప్రాంతానికి ఎంతో గుర్తింపు తెచ్చిన బలిరెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కుటుంబసభ్యులు, గ్రామస్తులు నిర్ణయించి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాన్ని ఈనెల 6వతేదీన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆవిష్కరిస్తారని గ్రామస్తులు తెలిపారు.

ఆదర్శ పాఠశాలల్లో ఐబీ బృందం అధ్యయనం



పాటిపల్లి మోడల్ స్కూల్‌ను సందర్శించిన ఐబీ బృందాన్ని సత్కరిస్తున్న దృశ్యం

- విద్యా విధానం, బోధనా పద్ధతుల పరిశీలన
- ఐబీ విద్య అమలుతో కలిగే ప్రయోజనాలపై చర్చ

కశింకోట : మండలంలోని తేగాడలో ఉన్న ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో విద్యా విధానాన్ని ఇంటర్నేషనల్ బాకలారియేట్ (ఐబీ) బృందం మంగళవారం పర్యటించి అధ్యయనం చేసింది. ఐబీ సీనియర్ కరిక్యులం డిజైన్ మేనేజర్ ఆల్తో, ఐబీ అసోసియేట్ మేనేజర్ మైఖేల్, రాష్ట్ర ఎస్‌సీఈఆర్‌టీ ప్రొఫెసర్ ఆచార్య కేశిరాజు శ్రీనివాస్, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ, జిల్లా ఉప విద్యాశాఖ అధికారి అప్పారావు ఈ బృందంలో ఉన్నారు. ఈ సందర్భంగా బృందం పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశమై అక్కడ అమలు చేస్తున్న విద్యా విధానం, బోధనా పద్ధతులు, ఉపాధ్యాయ శిక్షణ, బోధనలో అనుభవాలు తదితర అంశాలపై బృందం సభ్యులు చర్చించారు. ఈ సందర్భంగా ఆచార్య శ్రీనివాస్ రాష్ట్రంలో ఐబీ విద్యా విధానం అమలుతో కలిగే ప్రయోజనాలపై కూలంకషంగా బృందం సభ్యులతో చర్చించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఐ.మార్తాండ తిలకం, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పాటిపల్లి మోడల్ స్కూల్ సందర్శన

మునగపాక : మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్‌ను మంగళవారం ఐబీ బృందం సందర్శించింది. 2025–26 సంవత్సరం నుంచి రాష్ట్ర ప్రభుత్వం మొదటి తరగతి నుంచి ఐబీ ఇంటర్నేషనల్ రాయిట్‌ను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో జిల్లాలోని పాటిపల్లి మోడల్ స్కూల్‌ను ఎంపిక చేసుకొని సందర్శించారు. పాఠశాలలో బోధనా పద్ధతులు, అభ్యసన తదితర అంశాలపై ప్రిన్సిపాల్ పి.పి.ఎస్.శ్రీలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. కెమిస్ట్రీ ల్యాబ్‌ను, అటల్ ల్యాబ్‌లో విద్యార్థులు తయారు చేసిన అగ్రికల్చర్ కటింగ్ మిషన్‌ను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. మరిన్ని ప్రాజెక్టులు చేసేలా విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి తరగతిని సందర్శించి బోధన తీరును, ఐఎఫ్‌పీ బోర్డుల వినియోగాన్ని పరిశీలించారు. డిప్యూటీ డీఈవో పి.అప్పారావు, ఇతర ఉపాధ్యాయులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐబీ బృందాన్ని ఘనంగా సత్కరించారు.

సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన



సీఎం సభా స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



కశింకోటలో హెలిప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి/కశింకోట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో అనకాపల్లి మండలం పిసినికాడలో సభా స్థలాన్ని పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మంగళవారం పరిశీలించారు. ఇక్కడ సీఎం సభకు 50 వేల మంది ప్రజలు హాజరవుతారన్నారు. వీరికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అనంతరం ఆయన అక్కడ నుంచి నేరుగా కశింకోట మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ పనులను పరిశీలించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతితో కలిసి అధికారులతో చర్చించారు. అదేవిధంగా ఇక్కడ హెలిప్యాడ్ పనులను కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి పరిశీలించారు. సీఎం పర్యటన ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమావేశమై దిశానిర్దేశం చేశారు. అంతకుముందు హెలికాప్టర్ గాలిలో చక్కర్లు కొట్టి వెళ్లింది. దాని నుంచి అధికారులు హెలిప్యాడ్ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆర్డీవో చిన్నికృష్ణ, డీఎస్పీ ఎస్. అప్పలరాజు, ఎంపీడీవో శేషుబాబు, తహసీల్దార్ పాల్గొన్నారు.

దారితప్పిన యువతకు పుస్తకాలతో మార్పు

- మొబైల్, ఇంటర్నెట్ ఉచ్చులో చిన్నారులు
- సినీ గీత రచయిత, సాహితీవేత్త సుద్దాల అశోక్ తేజ



నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న సుద్దాల అశోక్‌తేజ

అనకాపల్లి: దారితప్పిన యువతను పుస్తకాలతో మార్పు తీసుకురావచ్చని సినీ గీత రచయిత, సాహితీవేత్త సుద్దాల అశోక్ తేజ పేర్కొన్నారు. గౌరీ గ్రంథాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించి మాట్లాడారు. వీసా, పాస్‌పోర్టు లేకుండా గ్రంథాలయాలు, పుస్తకాలతో విశ్వ విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. గతంలోకి, భవిష్యత్‌లోకి తీసుకెళ్లేది పుస్తకమే అన్నారు. లక్ష్య సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. మానవ, ఆత్మీయ సంబంధాలు పెంపుదలకు తెలుగు రాష్ట్రాల్లో విస్తృతంగా ప్రచారం చేయనున్నట్టు తెలిపారు. సమాజంలో మార్పులపై ప్రజలను సామాజిక గీతాలతో చైతన్యపర్చాల్సిన బాధ్యత రచయితలకు, సాహిత్యానికి ఉందన్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువతకు గౌరీ గ్రంథాలయం వెన్నుదన్నుగా నిలుస్తుందన్నారు. ప్రపంచంలో 40 శాతంపైగా ఆరేళ్ల లోపు పిల్లలు అశ్లీల దృశ్యాలు చూస్తున్నారని, అందుకు వైజ్ఞానిక సాధనాలే కారణమన్నారు. మొబైల్ , ఇంటర్నెట్ వినియోగం పట్ల తల్లిదండ్రులు పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు. కొన్ని సందర్భాల్లో మొబైల్ విజ్ఞాన దీపం అని, ప్రస్తుతం అది శాపంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో గౌరీ గ్రంథాలయం కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, నన్నయ్య యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ బి.ముత్యాలనాయుడు, గ్రంథాలయ అధ్యక్షుడు డి.నూకఅప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారిని దర్శించుకున సుద్దాల అశోక్‌తేజ...

గవరపాలెం నూకాంబిక అమ్మవారిని సుద్దాల అశోక్‌తేజ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ ఈవో బండారు ప్రసాద్, చైర్మన్ కొణతాల మురళీకృష్ణ అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

దేశంలోనే విశాఖకు ఎనలేని గుర్తింపు

- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్
- ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ భవన కాంప్లెక్స్ ప్రారంభం
- కలెక్టరేట్ వెనుక రూ.25.30 కోట్లతో నిర్మాణం



ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ భవన కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, చిత్రంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్, రాష్ట్ర ఖజానా డైరెక్టర్ మోహనరావు

మహారాణిపేట: దేశంలో అన్ని ప్రాధాన్యతలు ఉన్న నగరంగా విశాఖకు గుర్తింపు ఉందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయం వెనుక రూ.25.30 కోట్ల వ్యయంతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ భవన కాంప్లెక్స్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం భవన సముదాయాన్ని పరిశీలించి మాట్లాడారు. ఈ భవన సముదాయంలో ఆర్థిక శాఖకు సంబంధించిన అన్ని విభాగాలను తీసుకొచ్చే అవకాశం ఉందన్నారు. జిల్లా ట్రెజరీ శాఖ, పే అండ్ అకౌంటెంట్, ఆడిట్ విభాగం తదితర కార్యాలయాలను ఒకే కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేస్తామని మంత్రి వెల్లడించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ అభివృద్ధికి ప్రణాళిక ప్రకటించారని.. రానున్న రోజుల్లో విశాఖ పరిపాలన కేంద్రంగా మారనుందన్నారు. గడిచిన రెండేళ్లలో విశాఖలో అనే రకాల మౌలిక సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ ఇవ్వాలన్న ప్రభుత్వ ఆలోచన యువతకి ఎంతో మేలు చేస్తుందన్నారు. భవిత ద్వారా యువతలో నైపుణ్యత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ సంచాలకుడు ఎస్.మోహన్‌రావు, జిల్లా ట్రెజరీ అధికారి వై.సుధాకరరావు, అసిస్టెంట్ ట్రెజరీ అధికారులు(ఏటీవోలు) నాగార్జునరావు, నితిన్ జోషి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.93కోట్లు



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి హుండీ ఆదాయం రూ.1,93,77,877 వచ్చినట్టు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. సింహగిరిపై మంగళవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. నగదుతో పాటు 136.350 గ్రాముల బంగారం, 11.420 కిలోల వెండి లభించినట్టు ఈవో వెల్లడించారు. సింహగిరిపై ఉన్న యాత్రిక సదన్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన లెక్కింపులో దేవస్థానం అధికారులు, సిబ్బంది, పలు స్వచ్ఛంద సంస్థలకు చెందిన సభ్యులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కేసు

అనకాపల్లి: కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ శంకరరావు మంగళవారం తెలిపారు. ఆయన వివరాల మేరకు.... అచ్యుతాపురం మండలం మోసయ్యపేట గ్రామానికి చెందిన అద్దెపల్లి దానియాలు కుమారుడికి అనకాపల్లి పట్టణం శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన కె.శాంతికుమారి కుమార్తెకు గతేడాది అక్టోబర్ 6న కులాంతర వివాహమైంది. శాంతికుమారి కుమార్తె ప్రియాంక అచ్యుతాపురంలో ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగం చేస్తుండేది. వివాహం తర్వాత దానియాలు కుమారుడు ఆమెను ఉద్యోగం మాన్పించేశాడు. ఈ నేపథ్యంలో ఇరు కుటుంబాలు మధ్య గత నెల 10న పెద్దల సమక్షంలో గొడవలు జరిగాయి. ఆ సమయంలో దానియాలు కులం పేరుతో దూషించినట్లు శాంతికుమారి ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

4,550 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

- ఒకరి అరెస్టు, 5 లీటర్ల సారా స్వాధీనం

నాతవరం: సారా తయారీ చేసేందుకు సిద్ధం చేసిన బట్టీలపై ఎస్ఐ రామారావు తన సిబ్బందితో కలిసి మంగళవారం దాడి చేశారు. మండలంలో గుమ్మడిగొండ గ్రామ సమీపంలో తాండవ నది ఒడ్డున చాలా కాలంగా సారా తయారీ చేసి ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు 4,550 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారు. సంఘటన స్థలంలో లభ్యమైన ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీ సామగ్రిని స్టేషన్‌కు తరలించారు. నిందితుడు గంటా నానిని అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు ఢీకొట్టి వృద్ధుడి మృతి



రైలు పట్టాలపై వృద్ధుడి మృతదేహం

పాయకరావుపేట: పట్టణంలో నాగరాజుపేట రైల్వే గేటు సమీపాన వృద్ధుడు (60) మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తుని రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారుఫ్ తెలిపారు. మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో గుర్తు తెలియని రైలు ఢీ కొట్టడంతో అతడు మృతి చెందాడన్నారు. మృతుడి శరీరంపై తెలుపురంగు చొక్కా, నీలం రంగు గళ్ల లుంగీ ఉన్నాయన్నారు. కుడి మోచేతిపైన శివలింగం పచ్చబొట్టు ఉందన్నారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రిలో మార్చురీలో భద్రపర్చామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒడిశా ఉద్యోగి మృతి

మునగపాక: మండలంలోని నాగవరం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రైవేటు ఉద్యోగి మృతి చెందాడు. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా చమాకాండీ గ్రామానికి చెందిన స్వామినాథ పాండ(29) రాంబిల్లి మండలంలోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో సొంత పనిపై విశాఖ వెళ్లి ద్విచక్ర వాహనంపై రాంబిల్లికి వస్తున్నాడు. ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయే క్రమంలో బైక్ అదుపు తప్పింది. దాంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు మునగపాక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

10న గురుకులాల్లో ప్రవేశ పరీక్ష

కంచరపాలెం: రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 10న ఆదివారం పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లాల గురుకులాల సమన్వయకర్త ఎస్.రూపవతి తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి విశాఖ జిల్లా పరిధిలోని 3 గురుకులాలు, అనకాపల్లి జిల్లా పరిధిలో 8 గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఈ రెండు జిల్లాల్లో 5వ తరగతికి 880 సీట్ల కోసం 3,808, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 880 సీట్ల కోసం 2,221 విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు 5వ తరగతి అభ్యర్థులకు, సాయంత్రం 2 నుంచి 4.30 గంటల వరకు ఇంటర్ అభ్యర్థులకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 5వ తరగతి విద్యార్థులు https://apbragcet. apcfss. in/ fifth-hallticket, ఇంటర్ విద్యార్థులు https://apbragcet.apcfss.in/inter-hallticket వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆమె సూచించారు. మరిన్ని వివరాలకు 0891-2799641లో సంప్రదించవచ్చు.

క్లుప్తంగా

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

అనకాపల్లి: జీవీఎంసీ 83వ వార్డు పరిధి సచివాలయం–8 మళ్లవీధి కల్యాణ మండపంలో బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జగనన్న ఆరోగ్య సురక్ష–2 ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జెడ్సీ ఒమ్మి అయ్యప్పనాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వైద్యశిబిరంలో ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు, ప్రసూతి వైద్యురాలు, కంటి వైద్యుడు, వైద్యసిబ్బంది సేవలు అందిస్తారని, అంగన్‌వాడీ పౌష్టిక ఆహార ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. సచివాలయ పరిధిలో రోగులకు ఉచితంగా వైద్యం అందించి, మందులు పంపిణీ చేస్తారని తెలియజేశారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



భవన నిర్మాణ కార్మికులతో అలమండ శ్రీను

అనకాపల్లి: భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయని బీజేపీ మోర్చా రాష్ట్ర సభ్యుడు అలమండ శ్రీను తెలిపారు. అర్హులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తుమ్మపాల గ్రామంలో శారద గృహనిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులకు విశ్వకర్మ కౌశల్ యోజన, సోలార్ విద్యుత్, కార్మికులకు ఇన్సూరెన్స్ పథకాలు అమలు చేస్తున్నారని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కె.సన్యాసిరావు, సంఘం అధ్యక్షుడు రాపేటి వెంకట్, పార్టీ మండల అధ్యక్షుడు కె.తాతారావు తదితరులు పాల్గొన్నారు.

13న ఉచిత కంటి వైద్య పరీక్షలు

అనకాపల్లి: శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ నెల 13న ఉచిత కంటి ఆపరేషన్ల కోసం పరీక్షలు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి రాజా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి రాజా ఆప్టికల్స్ వద్ద ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. కంటి సమస్యతో బాధపడుతున్న రోగులు ముందుగా ఆస్పత్రి ఆవరణలో రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని సూచించారు. ఆపరేషన్ అవసరమైన రోగులకు ఉచితంగా ఆపరేషన్ చేసి, మందులు పంపిణీ చేస్తామని తెలియజేశారు.

ఎనిమిది మందికి కంటి ఆపరేషన్లు



ఆపరేషన్ అనంతరం రోగులతో రోటరీ క్లబ్ సభ్యులు

అనకాపల్లి: స్థానిక రోటరీ కంటి ఆస్పత్రిలో ఎనిమిది మందికి డాక్టర్ కె.మల్లేశ్వరరావు మంగళవారం కంటి ఆపరేషన్లు చేశారు. ఆస్పత్రిలో సోమవారం నిర్వహించిన కంటి వైద్యపరీక్షలకు 25మంది హాజరు కాగా, వారిలో ఎనిమిది మందికి నేత్ర శస్త్రచికిత్సలు అవసరం అయ్యాయని వైద్యులు చెప్పారు. వారికి మంగళవారం ఆపరేషన్ చేసి, ఐదురోజులకు సరిపడా మందులు ఉచితంగా అందించామన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి రోటరీ క్లబ్ అధ్యక్షుడు పి.జె.నాయుడు, సభ్యులు రవిరామ్ జవహర్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 5,430 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,900	4,600
మొదటి రకం	3,630	4,260
రెండో రకం	3,360	3,760
మూడోరకం	3,200	3,530

అనకాపల్లి సినిమాలు

ఈగల్	:	రాజా
ఆపరేషన్ వాలెంటైన్	:	సత్యనారాయణ స్క్రీన్-1
భ్రమయుగం	:	సత్యనారాయణ స్క్రీన్-2
సిద్ధార్థ రాయ్	:	షిర్డీసాయి
ఊరు పేరు భైరవకోన	:	పర్తిసాయి
వ్యూహం	:	వేంకటేశ్వర
ఇంటి నెం.13	:	శ్రీసత్య
చారి 111	:	రామచంద్ర

ఆడపడుచులకు అండగా..



నా పేరు మళ్ల గిరిజా భవానీ. మాది దిబ్బపాలెం గ్రామం. నా భర్త మెకానిక్‌గా పని చేస్తారు. మాకు ఇద్దరు పిల్లలు. జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత నాకు వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఏడాదికి రూ.18750 అందిస్తున్నారు. వీటితో పాటు నవరత్నాలు పథకంలో అందుతున్న ఆర్థిక సాయంతో ఫ్యాన్సీ షాప్ నిర్వహించుకుంటున్నాను. జగనన్న తోడు, వైఎస్సార్ చేయూతతో వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం డీఆర్‌డీఏ ద్వారా అజియో బ్రాండెడ్ దుస్తులను నాకు అందిస్తోంది. చీరలు, పంచెలు వంటి దుస్తులతో పాటు అన్ని వస్తువులు నా షాపులో విక్రయిస్తున్నాను. మా గ్రామంలో రోజుకు కనీసం రూ.15 వందల నుంచి రూ.2 వేల వరకు వ్యాపారం చేస్తున్నాను. మా పిల్లలకు విద్యాదీవెన కింద ప్రతి ఏటా రూ. 35 వేలు ఒకరికి, మరొకరికి రూ.40 వేలు అందిస్తున్నారు. ఎటువంటి చింతా లేకుండా మా కుటుంబం చాలా సంతోషంగా ఉంది.



- రేపు వైఎస్సార్ చేయూత పంపిణీ
- పిసినికాడలో బటన్ నొక్కి అక్కచెల్లెమ్మల ఖాతాల్లో వేయనున్న సీఎం జగన్
- రాష్ట్రస్థాయి కార్యక్రమానికి అనకాపల్లి ఎంపిక

తుమ్మపాల : వైఎస్సార్ చేయూత నగదు పంపిణీ కార్యక్రమానికి అనకాపల్లి మండలం పిసినికాడ గ్రామం వేదికైంది. రాష్ట్రస్థాయిలో చేయూత పథకాన్ని ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇక్కడికి చేరుకోనున్నారు. ఇప్పటికే అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. సభాస్థలిని ప్రభుత్వ పెద్దలతో పాటు, డీఐజీ విశాల్‌గున్ని పర్యవేక్షించి మహిళలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెంది, 45 ఏళ్లు దాటిన 18,419 మందికి నాల్గవ విడత వైఎస్సార్ చేయూత పథకం ద్వారా దాదాపు రూ.34 కోట్లను అక్కచెల్లెమ్మల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించే కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలి రానున్నారు. ముఖ్యమంత్రి ప్రారంభ కార్యక్రమం అనంతరం నియోజకవర్గాల వారీగా చేయూత వారోత్సవాలు నిర్వహించేందుక అధికారులు చర్యలు చేపడుతున్నారు.

కుటుంబాలకు వెన్నుదన్నుగా..

వైఎస్సార్ చేయూత పథకం ద్వారా పేద కుటుంబాల్లోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల్లో అర్హత కలిగిన అక్కచెల్లెమ్మలకు ఏటా రూ.18,750 నగదును జగనన్న ప్రభుత్వం అందజేస్తోంది. ఆ సాయంతో ఇప్పటికే ఎందరో మహిళలు చిరువ్యాపారాలు చేసుకుంటూ తమ కాళ్లపై తాము నిలబడ్డారు. కుటుంబాలకు వెన్నుదన్నుగా నిలిచారు. ఒకప్పుడు ఆర్థికంగా మరొకరిపై ఆధారపడిన మహిళలు నేడు తామే మరొకరికి ఆధారమవుతున్నారు.

నాలుగో విడత ఆసరా నిధుల పంపిణీ ఇలా..

మండలం	దరఖాస్తుదారులు	ఎంపికైనవారు	మొత్తం నగదు రూ.లలో
అనకాపల్లి	6,689	6,532	12,24,75,000
కశింకోట	6,111	6,006	11,26,12,500
అనకాపల్లి	జీవీఎంసీ 5,776	5,633	10,56,18,500
మొత్తం	18,576	18,171	34,07,06,250

విడతల వారీగా వైఎస్సార్ చేయూత నగదు (రూ. కోట్లలో)

మండలం	1వ విడత	2వ విడత	3వ విడత	4వ విడత
అనకాపల్లి	08.22	09.28	11.33	12.24
కశింకోట	08.47	09.20	10.64	11.26
అనకాపల్లిటౌన్	07.78	08.38	09.56	10.56
మొత్తం	24.47	26.86	31.53	34.06

అధినేతకు ఆత్మీయ స్వాగతం



వాణిజ్యవేత్తల సదస్సులో పాల్గొనేందుకు మంగళవారం విశాఖ విచ్చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి హెలీప్యాడ్ వద్ద పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి

ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి



స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

కశింకోట : నియోజకవర్గానికి తొలిసారిగా వస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకుని అధికారులు, సిబ్బంది విజయవంతం చేయాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కోరారు. కశింకోటలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌ను పరిశీలించిన అనంతరం మంగళవారం రాత్రి స్థానిక పంచాయతీ కార్యాలయంలో ముఖ్యమంత్రి పర్యటనపై ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతితో కలిసి అధికారులతో చర్చించారు. ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి మాట్లాడుతూ పెద్ద సంఖ్యలో ప్రజలు, ప్రధానంగా మహిళలు ముఖ్యమంత్రి సభకు తరలి వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, డీఆర్‌డీఏ పీడీ శశిదేవి, డ్వామా పీడీ సందీప్, అడిషనల్ పీడీ రోజారాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు మలసాల కిషోర్, మలసాల కుమార్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ సత్యవతికి తుమ్మపాల నాయకుల కృతజ్ఞతలు



ఎంపీ సత్యవతికి కృతజ్ఞతలు తెలుపుతున్న నాయకులు

తుమ్మపాల : పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న బొజ్జన్నకొండతో పాటు తుమ్మపాల గ్రామం వరకు సోలార్ లైటింగ్ నిమిత్తం రూ.10 లక్షల ఎంపీ ల్యాడ్స్ నిధులను ఎంపీ బీవీ సత్యవతి మంజూరు చేసి ఈ ప్రాంతం అభివృద్ధికి కృషి చేస్తున్నారని సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు అన్నారు. పట్టణంలో ఎంపీ నివాసం వద్ద మంగళవారం ఆమెను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ కృషి మూలంగానే బొజ్జన్నకొండకు రూ.7 కోట్ల కేంద్ర నిధులు మంజూరయ్యాయన్నారు. ప్రస్తుతం పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. సుమారు రూ.1.5 కోట్లు వెచ్చించి ప్రత్యేకంగా రోడ్డు కూడా పూర్తి చేశారన్నారు. తుమ్మపాల నుంచి బొజ్జన్నకొండ వరకు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం నడక చేస్తున్నారని, వారికి సోలార్ లైటింగ్ సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. అంతకు ముందు ఆయనతో పాటు ఉప సర్పంచ్ చదరం చిన్న, వార్డు సభ్యులు మదిబోయిన నాగరాజు, ఎం.రామారావు, టి.సత్యారావు, పి.కృష్ణ, వి.మోదునాయుడు ఎంపీకి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు.

శివరాత్రి వేడుకల ఏర్పాట్ల పరిశీలన



కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాన్ని పరిశీలిస్తున్న దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సుజాత

అనకాపల్లి : మహాశివరాత్రి వేడుకలు ఈనెల 8వ తేదీన జిల్లాలో అన్ని దేవాలయాల్లో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్.సుజాత అన్నారు. స్థానిక జీవీఎంసీ జోన్ పరిధిలో కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయం, సిద్ధిలింగేశ్వరస్వామి, భోగలింగేశ్వరస్వామి దేవాలయాల్లో మహాశివరాత్రి ఏర్పాట్లను మంగళవారం ఆమె పరిశీలించారు. మహా శివరాత్రికి ఆలయాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తాగునీరు, ఉచిత ప్రసాదం, పూల అలంకరణ తదితర ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దేవాలయాల ఈవోలు కె.ఆదినారాయణ, టి.రాజసులోచన, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు



పల్స్‌పోలియో కార్యక్రమ నిర్వహణ తీరును పరిశీలిస్తున్న వైద్యురాలు శాంతి

అనకాపల్లి : ఐదేళ్ల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలని విశాఖ ఏఎంసీ వైద్యురాలు కె.వి.శాంతి అన్నారు. బొజ్జన కొండ రహదారిలో గల ఇటుకల బట్టీ కూలీల పిల్లలకు వేసిన పోలియో చుక్కల వివరాలను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడైనా పిల్లలు మిగిలిపోతే దగ్గరలోని ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలను సంప్రదించాలన్నారు. పోలియో చుక్కలు వేసిన పిల్లల చేతిపై మార్కింగ్ వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం మరియమ్మ, ఎస్‌వీడీఎస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఈశ్వరరావు, ఆశ వర్కర్లు, వలంటీర్లు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌కు అభినందన



హారికను అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోన నాగేశ్వరావు

కశింకోట : మండలంలోని జెట్టపురెడ్డి సచివాలయంలో సంక్షేమ సహాయకురాలు (వెల్ఫేర్ అసిస్టెంట్)గా పని చేస్తున్న ఎంఎస్‌కే హారిక జాతీయ స్థాయి క్యారమ్స్ పోటీలకు ఎంపికైంది. 51వ స్టేట్ సీనియర్ క్యారమ్స్ ఛాంపియన్‌సిప్ -2024 పోటీలో ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈ పోటీలు మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ఈ నెల 6 నుంచి పది వరకు జరగనున్నాయి. ఈ సందర్భంగా హారికను సర్పంచ్ కోన అరుణ, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోన నాగేశ్వరరావు తదితరులు అభినందించారు.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

అనకాపల్లి : ప్రశాంత వాతావరణంలో ఇంటర్ పరీక్షలు జరుగుతున్నాయని ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కె.సుజాత చెప్పారు. మంగళవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఆంగ్ల పరీక్షకు 10,087 మంది జనరల్ విద్యార్థులకు గాను 9,868 మంది పరీక్షలు రాయగా 219 మంది గైర్హాజరయ్యారని, 2,295 మంది ఒకేషనల్ విద్యార్థులకు గాను 2,220 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 75 మంది గైర్హాజరైనట్లు ఆమె తెలిపారు.

సీఎం సభను జయప్రదం చేద్దాం



సర్పంచ్‌లు, ఎంపీటీసీల సమావేశంలో మాట్లాడుతున్న మలసాల భరత్‌కుమార్



జోనల్ కార్యాలయంలో కార్పొరేటర్లతో మాట్లాడుతున్న మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాల్గొనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 7న అనకాపల్లి మండలంలోని పిసినికాడ గ్రామంలో వైఎస్సార్ చేయూత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందున, వేలాదిగా మహిళలు, ప్రజలు సమావేశానికి హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సమష్టిగా జయప్రదం చేద్దామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనకాపల్లి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండాను మరోసారి ఎగరవేసేందుకు కృషి చేద్దామన్నారు.

ప్రజలంతా జగనన్న పక్షమే..

ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ రాష్ట్ర చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ ప్రతిపక్షాలు అన్నీ కలసికట్టుగా సీఎం జగన్‌మోహన్ రెడ్డిని ఓడించేందుకు ఎన్ని కుట్రలు పన్నినా.. ప్రజలు మాత్రం జగనన్న పక్షాన ఉన్నారని పేర్కొన్నారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా వైఎస్సార్‌సీపీదే విజయమన్నారు. పార్టీ శ్రేణులందరూ సీఎం జగన్ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు మాట్లాడుతూ సభకు పెద్ద ఎత్తున జనం తరలి వస్తున్నందున ఏర్పాట్లు బాగా జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.వి.వి.ఎం.మోహనరావు, కశింకోట జెడ్పీటీసీ దంతులూరి శ్రీధర్‌రాజు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి శివసత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

జోనల్ కార్యాలయంలో..

జీవీఎంసీ జోన్ పరిధిలో కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులతో స్థానిక జోనల్ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ సమావేశమయ్యారు. ఈ నెల 7న జరిగే సీఎం భారీ బహిరంగ సభను జయప్రదం చేసేందుకు ప్రతీ ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, 80, 81, 83 వార్డుల ఇన్‌చార్జ్‌లు కొణతాల భాస్కర్, పీలా రాంబాబు, జాజుల రమేష్, జీవీఎంసీ ఏపీడీ డికె.దొర తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు సత్కారం



వలంటీర్లతో కార్పొరేటర్ మందపాటి సునీత

అనకాపల్లి : ప్రభుత్వ సంక్షేమ పథకాలను వలంటీర్ వ్యవస్థ ద్వారా అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో అందిస్తున్నట్లు 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత అన్నారు. మంగళవారం వార్డు పరిధిలోని 13 ,14 సచివాలయాల వలంటీర్లను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ద్వారా అణగారిన వర్గాలకు సేవ చేసే అవకాశాన్ని వలంటీర్లకు కల్పించి సమాజంలో ఉన్నత స్థానం కల్పించారన్నారు. సీఎం ఇచ్చిన గురుతరమైన బాధ్యతను గుర్తించి మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చే విధంగా కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు, కార్యదర్శి శ్రీ గైపూరి రాజు, పార్టీ నేతలు దాడి బాగాలింగేశ్వరరావు, మొగలిపల్లి సుబ్బారావు, తాటికొండ జీవన్, సోముదుల హేమ, మొల్లేటి మూర్తి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

45 మద్యం సీసాలు స్వాధీనం

కశింకోట : కశింకోట కూడలి వద్ద అక్రమంగా తరలిస్తున్న 45 మద్యం సీసాలను మంగళవారం రాత్రి స్వాధీనం చేసుకుని గంపా మణేష్‌ను అరెస్టు చేసినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. స్థానిక హౌసింగ్ కాలనీలో విక్రయానికి తరలిస్తుండగా మద్యం సీసాలు పట్టుకుని స్వాధీనం చేసుకున్నామన్నారు.

సత్రం గౌరవాధ్యక్షునిగా రామసత్యనారాయణ



రామసత్యనారాయణను సత్కరిస్తున్న స్థానిక సంఘం సభ్యులు

అనకాపల్లి : స్థానిక చిన్నవీధికి చెందిన విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ రేపాక రామసత్యనారాయణ ఈనెల 3న తమిళనాడులోని అరుణాచలం ఆర్య వైశ్య నిత్యాన్న సత్రం గౌరవాధ్యక్షునిగా ఎన్నికై అనకాపల్లి తిరిగి వచ్చిన సందర్భంగా ఆయనను మంగళవారం సత్కరించారు. ఆయన మాట్లాడుతూ అనకాపల్లిలో జన్మించిన తను అరుణాచలం ఆర్య వైశ్య నిత్యాన్న సత్రానికి గౌరవాధ్యక్షునిగా ఎన్నిక కావడం అదృష్టమన్నారు. సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు..



మాట్లాడుతున్న ఎస్ఐ సత్యనారాయణ

అనకాపల్లి : కష్టపడి చదివే కంటే ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని పట్టణ ఎస్ఐ సత్యనారాయణ అన్నారు. జీవీఎంసీ వేల్పుల వీధి బాలికోన్నత పాఠశాల ఆవరణలో 10వ తరగతి విద్యార్థులకు టెస్ట్ నమూనా పరీక్షలు మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్షా సమయానికి ముందుగా కేంద్రానికి చేరుకోవాలన్నారు. బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ పోటీ పరీక్షల వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. అంతకు ముందు 100 మంది విద్యార్థులు నమూనా పరీక్ష రాయగా, ఉత్తమ ఫలితాలు సాధించిన ముగ్గురు విద్యార్థులకు ఎస్ఐ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో చిట్టిబాబు, హెచ్‌ఎం. రుధిరారాణి, ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి ఎస్.రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి వృద్ధుల సమస్యలు

అనకాపల్లి : వృద్ధుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు కాండ్రేగుల అప్పారావు అన్నారు. గవరపాలెంలోని వీవీ రమణ రైతు భారతి హాల్లో మంగళవారం సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. వృద్ధులు రైల్లో ప్రయాణించే సమయంలో టికెట్‌లో రాయితీ ఇవ్వాలని, 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ప్రభుత్వ రాయితీ కల్పించాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా వృద్ధులకు ప్రభుత్వ పింఛన్ రూ.5 వేలు పెంచాలని కోరారు.

మహిళలకు మ్యూజికల్ చైర్ పోటీ



సత్తెమ్మ కాలనీలో మ్యూజికల్ చైర్ పోటీల్లో పాల్గొన్న మహిళలు

కశింకోట : స్థానిక సత్తెమ్మ కాలనీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలకు మ్యూజికల్ చైర్ నిర్వహించారు. ఐద్వా జిల్లా నాయకురాలు డి.డి. వరలక్ష్మి, సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, పలు ప్రజా సంఘాల ప్రతినిధులు తనూజ, నారాయణమ్మ, జె. విజయ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి 'సురక్ష'



రోగి పాత చీటీలను పరీక్షిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి

అనకాపల్లి: పేదలకు విద్య, వైద్యం అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలోని మారేడుపూడి సచివాలయంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష–2 ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించి, మాట్లాడారు. మొదటి విడతలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి గ్రామాల్లో రోగుల నుంచి మంచి స్పందన రావడంతో, ప్రభుత్వం సచివాలయం పరిధిలో రెండోవిడత ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో జ్యోతి మాట్లాడుతూ సురక్ష శిబిరాల్లో ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు, ప్రసూతి వైద్యురాలు, కంటి వైద్యుడు పాల్గొని రోగులకు అవసరమైన అన్ని వైద్యసేవలు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎస్‌కె.నమీమ్, గ్రామ సర్పంచ్ సాలాపు కనకరాజు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, సచివాలయ ఉద్యోగులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.